ప్రతి అక్షరం ప్రజాహితం

Title code: AP TEL16425.

# ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: సి యం శ్రీనివాస్, పబ్లిషర్ : అనంతపురం బుధవారం 15-5-2024 సంపుటి :1 సంచిక :256 పేజీలు : 4 వెల : 5-00



**విలేకరులు కావలెను**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక





# 12 నుంచి 14 ఎంపి సీట్లు గెలుస్తున్నాం

## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వివరాలు 2లో

# నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు విడుదల



అమరావతి: ఆంధ్రప్రగతి సీఎం జగన్ ప్రభుత్వం చివరి నిమిషంలో తన సొంత కాంట్రాక్టర్లకు నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు విడుదల చేసేందుకు సిద్ధమైందని.. దీనిని తక్షణమే నిలుపుదల చేయాలని తెదేపా అధినేత చంద్రబాబు డిమాండ్ చేశారు.లబ్ధిదారులకు చెందాల్సిన నిధులను జగన్ సొంత కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌కు కొన్ని నెలల ముందు డీబీటీ పథకాలకు సీఎం అధికారికంగా బటన్ నొక్కినా గడువులోపు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ కాలేదని గుర్తు చేశారు. ఎందుకు జమ కాలేదో చెప్పాలని కేంద్ర ఎన్నికల సంఘం కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిందన్నారు.ప్రభుత్వ నిర్వహణ కోసం రిజర్వ్ బ్యాంకు, బ్యాంకుల నుంచి తరచూ ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లిందని... అప్పులపైనే ఆధారపడి రోజువారీ రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని లేఖలో ప్రస్తావించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, పీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ వంటి వాటిని కూడా చెల్లించకుండా ప్రభుత్వం బకాయిలు పెట్టిందని విమర్శించారు. ఆరోగ్య శ్రీకి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో సేవలు నిలిపేస్తామని ఆసుపత్రి యాజమాన్యాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. ఫైనాన్స్ కమిషన్ ద్వారా పంచాయతీ రాజ్‌కు చెందాల్సిన నిధులను సైతం ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపించారు.రుణాల కింద తెచ్చిన

మిగతా 2లో



# నేను రాజ్యాంగ పరిరక్షకుడను

- నేను రాజ్యాంగ పరిరక్షకుడను
- దానిని మారుస్తాననడం పచ్చి అబద్ధం
- ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీ

వివరాలు 2లో

# పులివర్తి నానిపై దాడి అమానుషం

## ఓటమి భయంతోనన్న లోకేశ్

అమరావతి,మే14: ఆంధ్రప్రగతి చంద్రగిరి తెదేపా అభ్యర్థి పులివర్తి నానిపై వైకాపా మూక దాడిని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థలో గెలుపు ఓటములు సహజమని.. అపజయం తప్పదనే సంకేతాలతో వైకాపా తన ఫ్యాక్షన్ విష సంస్కృతికి తెరలేపిందని మండిపడ్డారు. 'పద్మావతి మహిళ యూనివర్సిటీలో స్టాం÷-రగ్ రూమ్ పరిశీలించేందుకు వచ్చిన పులివర్తి నానిపై వైకాపా మూక దాడి దిగ్భాం÷-రతికి



గురిచేసింది. నాని అన్నతో మాట్లాడాను. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించాను. పోలీసులు వైకాపా మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను' అని లోకేశ్ ఎక్స్(ట్విటర్‌లో)లో పోస్టు పెట్టారు.

# రాష్ట్రంలో 9 నుంచి 13 ఎంపీ స్థానాలు గెలుస్తాం

హైదరాబాద్: ఆంధ్రప్రగతి తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 9 నుంచి 13 ఎంపీ స్థానాలు గెలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ సరళిపై మంగళ వారం ఆయన మీడియాతో మాట్లాడారు. సికింద్రాబాద్‌లో గతం కంటే పోలింగ్ మెరుగైందని, కాంగ్రెస్ అభ్యర్థికి కనీసం 20వేల మెజార్టీ వస్తుందన్నారు."ఆరేడు స్థానాల్లో భారాసకు డిపాజిట్లు కూడా రావు. మెదక్‌లో భాజపా మూడో స్థానంలోకి వెళ్లింది. ఏ పార్టీకి ఆ పార్టీ పనిచేసి ఉంటే అంచనా వేయడం సులువు. భారాస శ్రేణులు పూర్తి స్థాయిలో భాజపాకు పనిచేశాయి. భాజపాకు కేంద్రంలో 220కి పది అటో, ఇటో వస్తాయి. ఇవాళ ఫీడ్ బ్యాక్ తెప్పించుకుంటే 13 స్థానాలు వస్తాయని సమాచారం ఉంది. ఇంతటితో రాజకీయ కార్యకలాపాలు ముగిశాయి. ఇప్పటి నుంచి పరిపాలనపై దృష్టి ఉంటుంది.రైతు రుణమాఫీకి



నిధులు సమకూరుస్తాం.రైతు రుణమాఫీ, సమస్యలు, విద్యా సంవత్సరం మొదలు కానుంది, సన్నబియ్యం సరఫరా, పుస్తకాలు, యూనిఫామ్ తదితర అంశాలపై సమీక్ష చేస్తా. ఫార్మర్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి దానికి ఆదాయం సమకూర్చు తాం. దాని ద్వారా రుణం తీసుకుని రైతు రుణమాఫీ చేస్తాం. రైతుకు పెట్టుబడి, గిట్టుబాటు ధరలపై ప్రత్యేక దృష్టి ఉంటుంది

# జగన్‌కు సిబిఐ కోర్టులో ఊరట




## విదేశాలకు వెళ్లేందుకు అనుమతి

హైదరాబాద్,మే14ఆంధ్రప్రగతి

ఏపీ సీఎం వైఎస్ జగన్ కు సీబీఐ కోర్టులో ఊరట లభించింది. జగన్ విదేశీ పర్యటనకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. మే17 నుండి జూన్ 1 వరకు తన కుటుంబ సమేతంగా కలిసి లండన్ కు వెళ్లనున్నారు జగన్. ఏపీలో ఎన్నికలు ముగిశాయి. ప్రచారంలో బిజీబిజీగా గడిపిన జగన్.. కుటుంబంతో కలిసి లండన్ కు వెళ్లి రిలాక్స్ కానున్నారు. ఎన్నికల పోలింగ్‌కి ఫలితాలకు మధ్య 20 రోజుల సమయం ఉండటంతో జగన్ విదేశీ పర్యటన ప్లాన్ చేసుకున్నారు. జూన్ 1న తిరిగి ఏపీకి రానున్నారు.

జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. కాగా సీఎం జగన్‌పై ఆస్తుల కేసులు ఉన్నాయి.. ద ఆయనకు సీబీఐ కోర్టు షరుతులతో బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్ షరతుల ప్రకారం జగన్ దేశం విడిచి వెళ్లరాదు. అందుకే లండన్ వెళ్లేందుకు అనుమతి కోరుతూ సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జగన్‌కు అనుమతిని సిబై వ్యతిరేకించింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఖాళీ సమయం, తీరిక దొరకదని భావించి చాలా మంది పొలిటికల్ లీడర్స్ రిలాక్స్ మూడ్ లోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే సీఎం జగన్ కూడా తన సతీమణి వైఎస్ భారతితో కలిసి లండన్ కు వెళ్లనున్నారు. అక్కడ తన కుమార్తెతో సరదాగా

- మిగతా 2లో పేజిలో




# పాలమూరుకు శుభ ఘడియలు..

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సాగునీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. పెండింగ్ ప్రాజెక్టుపై భారీ నీటిపారుదల శాఖ సమీక్షలు నిర్వహిస్తూ పనుల్లో వేగం పెంచేందుకు పరిపాలనా పరమైన నిర్ణయాలు తీసుకుంటుంది.తొలిదశలో దక్షిణ తెలంగాణకు జీవధారైన పాలమూరు రంగారెడ్డిప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.ఈ ప్రాజెక్టు పాలమూరు చేవెళ్ల పేరుతో జలయజ్ఞంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మొదలు పెట్టాగా ప్రాజెక్టు పేరును పాలమూరు రంగారెడ్డి గా పేరుమార్చి బీఆర్ఎస్ ప్రభుత్వం 2015 మార్చిలో భూత్పూర్ లో పనులు ప్రారంభించినప్పటికీ పనుల్లో వేగం పెంచక, అనుమతులు సాధించలేక నత్తనడక నడిసింది.ఇప్పటి వరకు కేవలం నార్లాపూర్ పంపు హౌజ్ మాత్రమే పూర్తి కావడంతో ప్రాజెక్టు పనులను పూర్తిగా సమీక్షించి అవసరమైతే నిపుణుల సలహా మేరకు డిజైన్లు మార్చి నిర్మాణం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆంతరంగిక సమీక్షలు జరుపుతూ ఎన్నికల కోడ్ ముగియగానే పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా 7.95 టీఎంసీ సామర్థ్యంతో నార్లాపూర్ పంపు హౌజ్ పనులు పూర్తి చేశారు. భూగర్భంలో 145 మెగావాట్ల 9పంపులు ఏర్పాటు చేసి




ఒక పంపు ట్రైయల్ రన్ పూర్తి చేశారు. అలాగే 5.91 టీఎంసీ సామర్థ్యంతో 10 పంపులతో ఎదుల పంపుహౌజ్, 14.47 టీఎంసీల సామర్థ్యం, 10 పంపులతో వట్టెం పంపుహౌజ్ పనులు దాదాపుగాపూర్తి అయ్యాయి. అలాగే 5 పంపులతో16.01 టీఎంసీ సామర్థ్యంతో కరివెన పూర్తి కావడంతో పాటుగా పూర్తి అయిన పంపు హౌజ్ లన్నింటిలో భారీ సర్జ్ పూల్

నిర్మాణాలు పూర్తి చేశారు. సంబంధింత పంపు హౌజ్‌లకు అనుసంధానంగా జలాశ యాల నిర్మాణాల పనులు మధ్యలోనే నిలిచి పోయాయి.పెండింగ్ లో టన్నెల్ పనులు 90 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు హెడ్ వర్క్‌లు దాదాపుగా పూర్తి అయినప్పటికీ ఎత్తిపోతల అనంతరం నీటిప్రవాహం గమ్య స్థానానికి చేరేందుకు నిర్మించాల్సిన టన్నెల్ పనులు ప్రారంభం కాలేదు. దట్టమైన నల్లమల అడవుల మధ్యలోంచి భూగర్భం నుంచి కాలువలు తవ్వాల్సి ఉంది.

# మరో నాలుగు రోజులు వర్షాలే..!

## ఎల్లో అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ

నిజామాబాద్,, ఈ నెల 18 వరకు తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఉరుములు, ఈదుర ుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశా లున్నాయని హెచ్చరించింది.బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదుర ుగాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో పాటు నిజామాబాద్‌లో వర్షాలు కురిసే వానలు పడుతాయని గంటకు 40-50 కిలోమీటర్ల గాలులు వీచే అవకాశాలున్నాయని చెప్పింది.అలాగే, సిద్దిపేట, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డికి వానలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. 17న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ,



నాగర్ కర్నూల్ జిల్లాల్లో వానలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. 18న భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో వానలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇవాళ ఉదయం ఖమ్మం, వనపర్తి, సూర్యాపేట, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైందని టీఎస్‌డీపీఎస్ వివరించింది.

# నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

రూ.4వేల కోట్లు, బాండ్ల ద్వారా రూ.7వేల కోట్లు ప్రభుత్వం సమీకరించిందని, ఈ నిధులన్నీ ప్రభుత్వ ఉద్యోగులకు, పంచాయద తీలకు, ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు చెల్లించకుండా అనుకూల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. రాజకీయ స్వార్థం కోసం చేసే ఇలాంటి చర్యలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ కుటిల ప్రయత్నాలను వెంటనే అరికట్టేందుకు సీఎం జగన్ బినామీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులకు మేలు చేసే డీబీటీ పథకాలకు నిధులు చెల్లించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించాలని డిమాండ్ చేశారు. గవర్నర్‌కు రాసిన లేఖను కేంద్ర ఎన్నికల సంఘం, సీఎస్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శికి పంపారు

# నేను రాజ్యాంగ పరిరక్షకుడను

న్యూఢిల్లీ,మే:రాజ్యాంగాన్ని మార్చనున్నారంటూ విపక్షాలు తనపై చేస్తున్న ఆరోపణలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తోసిపుచ్చారు. తాను రాజ్యాంగ పరిరక్షకుడనని చెప్పారు. ఉత్తరప్ర దేశ్‌లోని వారణాసిలో మంగళవా రంనాడు నామినేషన్ వేసిన అనంతరం ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై మోదీ సమాధానమిచ్చారు. 'కాశీ' అనేది కేవలం ఒక మాట కాదని, అదొక భావోద్వేగమని వారణాసితో తనకు ఉన్న అనుబంధాన్ని మోదీ తెలియజేశారు. కాశీ ఎప్పటికీ చెక్కుచెదరదని, శతాబ్దాలుగా ఇది జనావాసంగా ఉందని చెప్పారు. గత పదేళ్లుగా కాశీతో తన అనుబంధం పెరుగుతూ వచ్చిందన్నారు. గంగా మాత అక్కున చేర్చుకుందనే అనుభూతి తనను ఎంతగానో ప్రభావితం చేస్తోందని తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో తనకు ఎదురైన అనుభవాలను, అప్పుడప్పుడు మధ్యలో ప్రసంగాన్ని ఆపి పెద్దలు, దివ్యాంగులు కనిపించినప్పుడు కనిపించినప్పుడు వారికి సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయమని కోరడంపై ప్రధాని మాట్లాడుతూ, ప్రజలతోనూ, వారి ఆలోచనతోనూ తాను కనెక్ట్ అవుతుంటానని చెప్పారు. జీవంలేని రోబోలా కేవలం ప్రసంగాలు ఇవ్వడం, పూర్తికాగానే వెళ్లిపోవడమనేది తన ప్రపంచం కాదని తెలిపారు.విపక్షాలు తనను ఆడిపోసుకోవడంపై మాట్లాడుతూ, ఇలాంటి వాటిని తాను పెద్దగా పట్టించుకోనని చెప్పారు.

'నేను ఎగ్జిట్ కాకముందే వాళ్లు ఇలాంటివి మొదలుపెట్టారు. నేను వెళ్లిపోయిన తర్వాత కూడా వారు ఇదే తీరు కొనసాగిస్తారని అనుకుంటున్నాను' అని వ్యాఖ్యానించారు. భగవంతుడు ఒక ప్రత్యేక పని మీద తనను పంపినట్టుగా భావిస్తుంటానని, తనకు అప్పగించిన పనని కొనిసాగిస్తూనే ఉంటానని మోదీ స్పష్టం చేశారు.

# జగన్‌కు సిబిఐ కోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

గడిపేందుకు కుటుంబంతో కలిసి వెళ్లే క్రమంలో హైదరాబాద్ నాంపల్లి సీబీఐ కోర్టును అనుమతి కోరుతూ పిటిషన్ వేశారు. అయితే దీనిపై గత వారం వాదోపవాదనలు జరిగాయి. మే 15న సీబీఐ కేసు విచారణకు వస్తున్న నేపథ్యంలో అనుమతి ఇవ్వకూడదని సీబీఐ తరఫు న్యాయవాదులు వాదించారు. అయితే సీఎం జగన్ తరఫు న్యాయవాదులు కూడా అందుకు కౌంటర్ చేశారు. జగన్ ఒక రాజకీయ పార్టీని నడుపుతున్నారని, ప్రస్తుతం ఆయన రాజ్యాంగబద్ధమైన ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారని, ఆయనను నమ్ముకుని ఒక రాష్ట్రంతో పాటు పార్టీ నేతలు ఉన్నారని కోర్టుకు తెలిపింది. దీనిపై వాదనలు విన్న సీబీఐ న్యాయమూర్తి తీర్పును మే 14కు వాయిదా వేశారు. తిరిగి ఈరోజు తీర్పు వెలువరించే క్రమంలో సీఎం వైఎస్ జగన్ కు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. చట్టంలోని రైట్ టు ట్రావెల్ అబ్రాడ్ ప్రకారం బెయిల్ లో ఉన్న వ్యక్తికి అతని పరిస్థితులు, ప్రవర్తనను బట్టి విదేశాలకు వెళ్లేందుకు అవకాశం కల్పించవచ్చని తెలిపింది. దీంతో మే 17 నుంచి జూన్ 1 వరకు లండన్ వెళ్లేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కుటుంబం?తో కలిసి వెకేషన్?కు విదేశాలకు వెళ్లేందుకు సీఎం జగన్ కోరిన అనుమతిని మంజూరు చేసింది. సీబీఐ కేసుల్లో బెయిల్ మీద ఉన్న సీఎం జగన్ ఇప్పటికే చాలా సార్లు ఇలా అనుమతి తీసుకుని లండన్, దావోస్ వెళ్లారు. గతంలో తన కుమార్తె పెద్ద చదువుల నిమిత్తం ఆమెను లండన్ లో విడిచిపెట్టి వచ్చేందుకు కూడా తోడుగా వెళ్లారు. ఇలా చాలా సార్లు సీఎం జగన్ విదేశాలకు వెళ్లి తిరిగి కోర్టు చెప్పిన గడువులోపు తిరిగి రావడంతో ఈ సారి కూడా విదేశాలకు వెళ్లేందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# 12 నుంచి 14 ఎంపి సీట్లు గెలుస్తున్నాం

జయశంకర్ భూపాలపల్లి,మే14:జిల్లాలోని కాటారం మండలం దన్వాడలో శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,మంత్రి శ్రీధర్ బాబు దర్శించుకున్నారు. శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దత్తాత్రేయ స్వామి దర్శనం చేసుకోవడంతో తన జన్మధన్యమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని అర్థమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు12 నుంచి 14 సీట్లు కాంగ్రెస్ గెలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు.

రాహుల్ గాంధీచేసిన బస్సుయాత్ర, పాదయాత్రతో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోందన్నారు. రాహుల్ పోరాటాల ఫలితాలు.. కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి ప్రజలు ఓట్ల ద్వారా చూపిస్తున్నారని తెలిపారు. కొన్ని పార్టీలు అన్ని బావజాలలను పక్కనపెట్టి ప్రజల్లో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడానికి చూశాయని మండిపడ్డారు. ప్రజలు మాత్రం ఇండియా కూటమి వైపే మొగ్గు చూపారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై రేపు కేటీఆర్ సమావేశం



హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇక నల్లగొండ - వరంగల్ - ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక మిగిలింది. ఈ నేపథ్యంలో ఈ మూడు ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులతో కేటీఆర్ బుధవారం భేటీ కానున్నారు.ఎమ్మెల్సీ ఉప ఎన్నిక వ్యూహం, కార్యాచరణపై కేటీఆర్ చర్చించి, దిశానిర్దేశం చేయనున్నారు. ఈ ఉప ఎన్నికకు బీఆర్ఎస్ తరపున ఏనుగుల రాకేశ్ రెడ్డి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే.ఈ నెల 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనున్నది. జూన్ 5న ఓట్లు లెక్కిస్తారు. అధికారులు వెల్లడించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 4,61,806 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళా ఓటర్లు 1,74,794, పురుషులు 2,87,007 మంది, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు ఉన్నారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,67,853 మంది ఓటర్లు ఉన్నారు.రాకేశ్ రెడ్డి సొంతూరు.. హన్మకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం వంగపహాడ్. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన రాకేశ్ రెడ్డి.. బిట్స్ పిలానీలో మాస్టర్ మేనేజ్‌మెంట్ స్టడీస్, మాస్టర్స్ ఇన్ ఫైనాన్స్ పూర్తి చేశారు. సిటీ బ్యాంక్ మేనేజర్‌గా, జేపీ మోర్గాన్, ఫేస్‌బుక్ లాంటి పలు అంతర్జాతీయ కార్పోరేట్ కంపెనీల్లో బెంగళూరు, అమెరికాలలో ఏడేళ్ల పాటు ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేసిన ఆయన రాజకీయాలపై ఆసక్తితో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2013లో బీజేపీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. అంచెలంచెలుగా ఎదుగుతూ బీజేపీలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా, రెండు పర్యాయాలు రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు.

# ఇప్పటికే 270 సీట్లు గెలిచేసాం

(మొదటి పేజీ తరువాయి)

కచ్చితంగా చెప్పగలను. 400కు పైగా సీట్లు గెలుచుకోవడమే మా లక్ష్యం అని అమిత్‌షా అన్నారు. సీఏఏపై మమతా బెనర్జీ అపోహలు వ్యాప్తి చేస్తున్నారని, ఈ చట్టం కింద మతువా తెగల వారు పౌరసత్వం పొందుతారని ఆయన హామీ ఇచ్చారు. సీఏఏ కేంద్ర ప్రభుత్వ చట్టమైనందున దానిని అమలు కాకుండా మమతా బెనర్జీ ఎంతమాత్రం అడ్డుకోలేరని స్పష్టం చేశారు. శరణార్థులైన సోదరులకు దేశ పౌరసత్వం లభించకుండా ఈ ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదన్నారు. ఇది మోదీ ఇచ్చిన వాగ్దానమని గుర్తుచేశారు. పౌరసత్వం అనేది కేంద్ర ప్రభుత్వానికి ఉన్న విశిష్ఠ అధికారమే కానీ, రాష్ట్ర ప్రభుత్వాలది కాదనే విషయం మమతా బెనర్జీ గుర్తుంచుకోవాలన్నారు.

# 'దోస్త్' షెడ్యూల్‌లో స్వల్పమార్పు..

## 20 నుంచి వెబ్ ఆప్షన్లు




హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతోన్న విషయం తెలిసిందే.ఇంటర్ పాసైన విద్యార్థులు రూ. 200 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అయితే ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మే 15 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు.

కానీ ఈ షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యార్థులు గమనించాలని అధికారులు సూచించారు. జూన్ 3న మొదటి విడత సీట్లను కేటాయిస్తారు. రాష్ట్రంలోని 1066 కాలేజీల్లో మొత్తం 4,49,449 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మూడు విడతల్లో దోస్త్ ప్రక్రియను పూర్తిచేస్తారు.

# పులివర్తి నానిపై హత్యాయత్నం..

తిరుపతి: చంద్రగిరి తెదేపా అభ్యర్థి పులివర్తి నానిపై హత్యాయత్నం ఘటనతో తిరుపతిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాడి సమాచారం తెలుసుకున్న తెదేపా శ్రేణులు పద్మావతి మహిళా వర్సిటీ వద్దకు భారీగా చేరుకున్నారు.నానికి మద్దతుగా నిరసన తెలిపేందుకు వచ్చిన కార్యకర్తలపై పోలీసుల లాఠీ ఛార్జి చేయడంతో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దాడి చేసిన నిందితులను వదిలేసి తమపై పోలీసులు లాఠీ ఛార్జి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పోలీసులు తొత్తులుగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. దీంతో



మంగళవారం మధ్యాహ్నం నుంచి తిరుపతి రణరం గంగా మారింది. మీడియా ప్రతినిధులపై కూడా పోలీసులు లాఠీ ఝుళిపించడంతో వారు కూడా నిరసనకు దిగారు. సీఐ రామచంద్రారెడ్డి తీరుకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు.

# మహానందిలో ఘనంగా వార్షిక పుష్కరోత్సవం.



ఆంధ్ర ప్రగతి మహానంది,మే14:
మహానంది క్షేత్రంలో వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా వార్షిక పుష్కరోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి సుధా కుమారి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర్ అవధాని రాజగోపురం వద్ద గంగాదేవి ఉత్సవ మూర్తిని ఆస్థానం గావించి, ఉపచారములన్నీ సమర్పించి, తదుపరి సాదరా ఆహ్వానంతో, నంది తీర్థము(రుధ్రగుండం) లోనికి తీసుకొని వెళ్ళి, ప్రత్యేక విశేష ద్రవ్యాలతో అభిషేకాదులు చేశారు.అలాగే గంగమ్మకు అలంకార హారతులిచ్చి, సంకల్ప స్నానం నిర్వహించారు.పుష్కర స్నానానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు.

# భక్తులతో కళకళలాడిన మహానంది క్షేత్రం.



ఆంధ్ర ప్రగతి మహానంది, మే14:ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది పుణ్యక్షేత్రంలో భక్తులతో కళ కళలాడింది.మంగళవారం వైశాఖ శుద్ధ సప్తమి సందర్భంగా స్థానికులు పలు ప్రాంతాలకు చెందిన భక్తులే కాక వేలాదిమంది మహానందికి తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడితో నెలకొంది. భక్తులు రుద్ర గుండం కోనేరులో పుష్కరోత్సవ పుణ్య స్థానాలు ఆచరించి, శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని, అభిషేకం కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు.
స్వామి అమ్మవార్ల దర్శనార్థం భక్తులు బారులు తీరారు.

# తుప్పు పట్టిన మంచి నీటి పైపులు

-వృథాగా పోతున్న మంచినీరు.

-కాల్వ నిండితే పైపుల్లో మురుగునీరు.

-పైపులు మరమత్తు చేయాలని ప్రజల వినతి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల మే14: నంద్యాల పట్టణం ఎన్జీఓ కాలనికి వెళ్ళే రహదారిలో వినాయక దేవాలయం ఎదురుగా మంచినీటి పైపులు తుప్పు పట్టిపోయాయి.కొన్ని నెలలుగా మంచినీటి పైపులు తుప్పు పట్టిన అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.కాల్వ పైన వుండడంతో కాల్వ నిండితే మురుగు నీరు పైపుల్లోకి వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.చుక్క మంచినీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వేసవి కాలంలో నీళ్ళు వృథాగా పోవడం విశేషం.సమీపంలో ఉన్న ఒక కౌన్సిలర్ దృష్టికి ప్రజలు తీసుకొని పోయినా ఫలితం లేదని ఆరోపిస్తున్నారు.అధికారులు వెంటనే తుప్పు పట్టిపోయిన పైపులను తీసివేయాలని కోరుతున్నారు. పైపులో మురుగునీరు వస్తుండడంతో ప్రజలు నీళ్ళు పెట్టుకోకుండా బయట కొనుగోలు చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందిస్తారని ఆశిద్దాం.

# ఓటర్ల కోసం దూసుకెళ్లిన రైలుబండి

అమరావతి: ఓటర్లు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తున్న రైలు ఆలస్యంగా నడుస్తుండటంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) స్పందించి ఆ రైలుకు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేయించారు.తద్వారా పోలింగ్ సమయం ముగియడానికి ముందే గమ్యస్థానానికి చేరేలా చూశారు. నాందేడ్-విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (20812) ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి సోమవారం ఉదయం 9.10 గంటలకు విశాఖపట్నం చేరుకోవాల్సి ఉన్నా రైల్వే భద్రతా పనుల కారణంగా దాదాపు 7-8 గంటల పైనే ఆలస్యంగా నడిచింది. ఆ రైలులో ఓటింగ్‌కు వస్తున్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు 800 మందికి పైనే ఉన్నారు.

# ఓడిపోతే జైలుకెళ్ళడం ఖాయం

-టిడిపి రాష్ట్ర నాయకులు కొర్రపాటి సురేష్.



ఆంధ్ర ప్రగతి పల్నాడు మే 14: వైసిపి అవినీతి అరాచకాలపై ప్రశ్నిస్తూ పల్నాడు జిల్లాలో వైసిపికి కొరకరాని కొయ్యగా మారిన కన్నా లక్ష్మీ నారాయణపై కక్ష పెంచుకుని ఎన్నికల్లో ఎలాగైనా ఓడించాలని భారీ స్థాయిలో జగన్ మోహన్ రెడ్డి అంబటి రాంబాబు కుట్రలు చేసినా పారకపోవడంతో ఓర్వలేక ఘర్షణలు సృష్టించి ఎన్నికలు జరగకుండా చేయాలని ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయాలని చూశారని అమాయక టిడిపి జనసేన బిజెపి కార్యకర్తలపై దాడులకు పాల్పడటం వైసిపి పిరికిపంద చర్యలకు నిదర్శనమని ఓడిపోతే జైలుకెళ్ళడం ఖాయమని అంబటి రాంబాబు జగన్ మోహన్ రెడ్డి అవినీతి అరాచకాలకు పాల్పడిన వైసిపి నేతలంతా గజగజలాడుతున్నారని కన్నా పై జగన్ మోహన్ రెడ్డి అంబటి రాంబాబు రాళ్ళ వర్షం కురిపిస్తే సత్తెనపల్లి ప్రజలు పూలవర్షం కురిపించబోతున్నారని టిడిపి జనసేన బిజెపి కూటమి అధికారంలోకి రావడం తథ్యమని పేదలకు మేలు చేయాలని మా నాయకుడు కన్నా లక్ష్మీ నారాయణ పరితపిస్తుంటే పదవుల కోసం అంబటి రాంబాబు జగన్ మోహన్ రెడ్డి అమాయకుల రక్తం చిందిస్తున్నారని వైసిపి రౌడీయిజానికి నూకలు చెల్లాయని ప్రజలు నిన్న జరిగిన ఎన్నికల్లో భారీ స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొని వైసిపికి గుణపాఠం చెప్పారని టిడిపి అధికారంలోకి వస్తే ఈడ్చుకెళ్ళి న్యాయస్థానాల ముందు నిలబెట్టే రోజులొస్తాయని అంబటి రాంబాబు ఆయన గూండాలు గుర్తుపెట్టుకోవాలని అన్నారు.అంబటి రాంబాబు వంటి ఆకు రౌడీలను కన్నా రాజకీయ అనుభవంలో కోకొల్లలు చూశారని మా నాయకుడు ఓర్పు సహనం కోల్పోతే అంబటి రాంబాబు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.అంకుశంలో రామిరెడ్డికి పెట్టిన గతే అంబటి రాంబాబుకి పట్టినా ఆశ్చర్య పోనవసరం లేదని కొర్రపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హాలిడే మూడ్‌లో లీడర్లు..

# జూన్ 4 వరకు ఆగాల్సిందే..!



ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 14:తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. అటు ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు కూడా ఎట్టకేలకు పూర్తయ్యాయి. పోటాపోటీగా సాగిన ఎన్నికల సమరం ముగిసినట్లైంది. ఇక ఓట్ల లెక్కింపు కోసం నేతలు 20 రోజులపాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది.
లోక్‌సభ ఎన్నికలు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్న సంగతి తెలిసిందే.జూన్ 4 ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. తెలంగాణలో లెక్కింపు కేంద్రాలలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేయనున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 44 కేంద్రాల్లో ఓట్లను లెక్కించనున్నారు. ఇప్పటికే స్ట్రాంగ్‌రూంల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలతోపాటు సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షిస్తున్నారు.ఫలితాల టెన్షన్.. ఉపశమనం కోసం నేతల ట్రిప్పులుప్రజలు ఎవరిని తమ ప్రతినిధిగా ఎన్నుకున్నారో తెలియాలంటే మరో మూడు వారాలు ఆగాల్సిందే. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజా తీర్పు ఏ విధంగా ఉండబోతుందనే టెన్షన్ నుంచి ఉపశమనం కోసం నేతలు జాలీగా ట్రిప్‌లు ప్లాన్ చేస్తున్నారుప్రచార హడావుడి, మైకుల హోరు, రోడ్‌షోలు, ర్యాలీలు, సభలు, సమావేశాలతో హోరెత్తించిన ఫలితాలు వచ్చేలోపు కాస్త సేదతీరేందుకు సిద్ధమవుతున్నారు.దీనిలో భాగంగా కొందరు విదేశాలకు వెళ్లేందుకు పయణమవుతుంటే.. మరికొందరేమో స్వదేశంలోనే పర్యాటక ప్రాంతాలకు కనీసం రెండు, మూడు వారాల పాటు గడపాలని ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఒకటి రెండు వారాలపాటు తమను కలవడానికి కూడా ఎవరూ రావొద్దని ఆదేశిస్తున్నారు. మే 17 నుంచి ఐరోపా పర్యటనకు వెళ్లేందుకు ఏపీ ముఖ్యమంత్రి జగన్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే.

# ఈవీఎం లు భద్రపరిచిన స్ట్రాంగ్ లకు ప్రతిష్ఠ భద్రత.

-జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 14:
జిల్లా వ్యాప్తంగా మే 13వ తేదీజరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కు సంబంధించిన ఈవీఎం బాక్స్ లను ఆర్జీఎం శాంతిరాం ఇంజనీరింగ్ మరియు ఫార్మసీ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూం లలో భద్రపరచడం జరిగింది.14వ తేదీ మంగళవారం స్ట్రాంగ్ రూముల వద్ద ఏర్పాటుచేసిన మూడంచెల కేంద్ర పోలీస్ బలగాల గార్డును, జిల్లా ఆర్మ్ పోలీస్ గార్డును మరియు సివిల్ పోలీస్ బందోబస్తును పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలను జారీ చేయడం జరిగింది. స్ట్రాంగ్ రూమ్ కి నలువైపులా పోలీస్ పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని, నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని, మరియు స్ట్రాంగ్ రూముల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ఐపీఎస్ తెలిపారు.ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏ చిన్న అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా సమర్థవంతముగా విధులు నిర్వర్తించాలని, జిల్లాలోని పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ సిబ్బందిని నిరంతరం అప్రమత్తం చేయాలనీ అధికారులకు ఆదేశించారు.
నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకునే అవకాశం లేకుండా జిల్లా వ్యాప్తంగా పోలీస్ పికెట్లు మరియు మొబైల్ పెట్రోలింగ్ పార్టీలను ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు.ప్రజలు, రాజకీయ పార్టీలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైన యెడల పోలీస్ వారికి తక్షణం సమాచారం అందించాలని, నిరంతర%శీ% జిల్లా పోలీసులు అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ కె. రఘువీర్ రెడ్డి తెలిపారు.

# ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడంటే?





ఆంధ్ర ప్రగతి అమరావతి మే 14:
జూన్ 1న ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయి.
దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ సమయంలో అన్ని దశల పోలింగ్ తర్వాతే ఇవి రిలీజ్ అవుతాయి.
ముందుగా విడుదల చేస్తే మిగతా ఫేజ్ల ఎన్నికలు ప్రభావితం అవుతాయనే కారణంతో ఎగ్జిట్ పోల్స్పై ఈసీ ఆంక్షలు విధిస్తుంది. ప్రస్తుతం 4వ దశ ఎన్నికలు పూర్తి కాగా జూన్ 1న చివరిదైన 7వ దశ పోలింగ్ జరగనుంది. దీంతో అదే రోజు సాయంత్రం 6.30 నుంచి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడతాయి.

# శిరివెళ్ళ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన బీ.సీ ఫిదా హుస్సేన్.



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ మే 14 : శిరివెళ్ల మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు బిసి ఫిదా హుస్సేన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ... ఓటు హక్కును వినియోగించుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈసారి ఆళ్లగడ్డలో కూటమి అభ్యర్థి భూమా అఖిలప్రియ గెలుపని, భూమా జండా ఎగరబోతుందని ధీమా వ్యక్తం చేస్తూ ఓటర్ మహాశయులకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా అవ్వ , తాతలకు అక్క , చెల్లెమ్మలకు నిరుద్యోగులకు , మద్యం ప్రియులకు , యువతకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో సమన్వయంతో ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించిన పోలీసులకు ఎన్నికల అధికారులకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. గత ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్ శాతం 83.12 ప్రజలు తమ ఓటును వినియోగించుకున్నారని ఇది కచ్చితంగా తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల కూటమి విజయానికి నాంది అని జూన్ 4 న ఆళ్లగడ్డలో భూమా జండా ఎగురుతోందని తన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు , కుటమి అభిమానులు పాల్గొన్నారు.

# అల్లు శిరీష్..బడ్డీ ఫస్ట్ లుక్స్ విడుదల




టాలీవుడ్ యాక్టర్ అల్లు శిరీష్ ప్రస్తుతం బడ్డీ సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే. స్టూడియో గ్రీన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న బడ్డీ నుంచి ఇప్పటికే ఫస్ట్ లుక్‌తోపాటు గ్లింప్స్ వీడియోను లాంఛ్ చేయగా.. నెట్టింట హల్ చల్ చేస్తోంది. రౌడీ గ్యాంగ్ టెడ్డీని చంపేందుకు ప్రయత్నించే నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు గ్లింప్స్ వీడియో చెబుతోంది. చాలా రోజుల తర్వాత ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ఆ పిల్ల కనులే సాంగ్ అప్‌డేట్ అందించారు. ఈ పాటను ఉదయం 10 గంటలకు లాంఛ్ చేయనున్నట్టు ప్రకటించారు. హీరోహీరోయిన్లు ఫోన్‌లో చిట్‌చాట్ చేస్తున్న లుక్ ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఇక టెడ్డీ మనుషుల్లా ప్రవర్తించడం.. రౌడీలు టెడ్డీని టార్గెట్ చేయడం.. అల్లు శిరీష్ టెడ్డీని కాపాడేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నాడనే అంశాల చుట్టూ సినిమా ఉండబోతున్నట్టు గ్లింప్స్ క్లారిటీ ఇచ్చేస్తుంది.

# ఏపీలో అర్ధరాత్రి 12 గంటల వరకు 78.36 శాతం పోలింగ్.

ఆంధ్ర ప్రగతి అమరావతి మే 14:
కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకు కొనసాగిన పోలింగ్
డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా 83.19 శాతం పోలింగ్63.19 శాతంతో అట్టడుగున నిలిచిన అల్లూరి సీతారామరాజు జిల్లా
అధికారిక గణాంకాలను వెల్లడించిన ఈసీ



చెదురుమదురు హింసాత్మక ఘటనలు మినహా ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకు కూడా పోలింగ్ కొనసాగింది. అన్ని చోట్లా పోలింగ్ ముగింపు సమయానికి ఏపీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ 78.36 శాతంగా నమోదయింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ప్రకటించింది. అత్యధికంగా డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 83.19 శాతం పోలింగ్ నమోదయింది. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 63.19 శాతం నమోదయింది. ఈ మేరకు అర్ధరాత్రి 12 గంటల వరకు అందిన డేటాను అధికారిక యాప్‌లో ఎన్నికల సంఘం అప్‌డేట్ చేసింది.

జిల్లాలవారీగా ఓటింగ్ శాతాలు ఇలా ఉన్నాయి..

| | |
|---|---|
| అల్లూరి సీతారామరాజు | -63.19 శాతం |
| అనకాపల్లి | -81.63 శాతం |
| అనంతపురం | - 79.25 శాతం |
| అన్నమయ్య | - 76.12 శాతం |
| బాపట్ల | - 82.33 శాతం |
| చిత్తూరు | - 82.65 శాతం |
| అంబేద్కర్ కోనసీమ | - 83.19 శాతం |
| తూర్పు గోదావరి | - 79.31 శాతం |
| ఏలూరు | - 83.04 శాతం |
| గుంటూరు | - 75.74 శాతం |
| కాకినాడ | - 76.37 శాతం |
| కృష్ణా | - 82.20 శాతం |
| కర్నూలు | - 75.83 శాతం |
| నంద్యాల | - 80.92 శాతం |
| ఎన్టీఆర్ | - 78.76 శాతం |
| పల్నాడు | -78.70 శాతం |
| పార్వతీపురం మన్యం | - 75.24 శాతం |
| ప్రకాశం | - 82.40 శాతం |
| పొట్టిశ్రీరాములు నెల్లూరు | - 78.10 శాతం |
| శ్రీ సత్యసాయి | - 82.77 శాతం |
| శ్రీకాకుళం | - 75.41 శాతం |
| తిరుపతి | - 76.83 శాతం |
| విశాఖపట్నం | - 65.50 శాతం |
| పశ్చిమ గోదావరి | -81.12 శాతం |
| వైఎస్సార్ | - 78.12 శాతం |

# సైంధవితో తెగదెంపులు చేసుకున్న జివి ప్రకాశ్




ఇద్దరం విడిపోతున్న ప్రకటనతమిళ సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ ఆయన భార్య గాయని సైంధవితో విడిపోతున్నట్లు ప్రకటించారు. 11 ఏళ్ల వైవాహిక బంధానికి వీడ్కోలు పలుకుతున్నట్లు ఇద్దరూ సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్టు చేశారు. ఆస్కార్ అవార్డ్ విన్నర్ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ మేనల్లుడు. అయిన జీవీ ప్రకాశ్.. 2013లో తన బాల్య స్నేహితురాలు సైందవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. 2020లో వారికి ఓ కూతురు పుట్టింది. ప్రస్తుతం పలు కారణాల వల్ల ఇద్దరూ విడిపోతున్నారు. 'చాలా ఆలోచించిన తర్వాత 'సైంధవి, నేను 11 ఏళ్ల వైవాహిక బంధానికి వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నాం. మానసిక ప్రశాంతత, ఇద్దరి జీవితాల్లో మెరుగుకోసం ఒకరికొకరం పరస్పర గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇలాంటి కీలక తరుణంలో మా ప్రైవసీకి భంగం కలిగించకుండా ఉండేందుకు మీడియా, స్నేహితులు, అభిమానులు మా నిర్ణయాన్ని అర్థం చేసుకోవాలని కోరుకుంటున్నాం. ఇక నుంచి మేము వేరవుతున్నట్లు అంగీకరిస్తున్నాం.

# యశ్ టాక్సిస్‌లో హ్యూమా ఖురేషి





'కేజీఎఫ్' చిత్రం పాన్ ఇండియా స్థాయి సక్సెస్ కావడంతో యశ్ క్రేజ్ మామూలుగా పెరగలేదు. పాన్ ఇండియాలో గుర్తింపు పొందిన స్టార్స్‌లో అతను కూడా ఒకడిగా స్థానం సంపాదించుకున్నారు. ఆయన తదుపరి చిత్రం 'టాక్సిక్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇందులో నయనతార ఓ ప్రధాన పాత్రపోషిస్తునట్లు ఇప్పటికే వార్తలు హల్‌చల్ చేశాయి. ఇప్పుడు ఇందులో మరో పాత్రలో బాలీవుడ్ భామ హ్యూమా ఖురేషీ ఎంపిక అయినట్లు సమాచారం అందింది. ఇందులో ఆమె పాత్ర పూర్తిగా యాక్షన్ తరహాలో ఉంటుందని చిత్ర వర్గాల నుంచి సమాచారం. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ చిత్రంలో వీఎఫ్‌ఎక్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందని ఇప్పటికే యాష్ తెలిపారు. దానికోసం యూఎస్‌లోని కొన్ని ప్రముఖ అంతర్జాతీయ వీఎఫ్‌ఎక్స్ స్టూడియోలతో సంప్రదింపులు కూడా జరుపుతున్నారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా వెర్షన్, ఇంటర్నేషనల్ వెర్షన్‌గా రెండు రూపాల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్ విడుదల కానుంది.

# నేడు డబుల్ ఇస్మార్ట్



రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన బ్లాక్‌బస్టర్ మూవీ 'ఇస్మార్ట్' శంకర్. 2019లో విడుదలైన ఈ చిత్రం అటు పూరి, ఇటు రామ్‌కు ఓ డిఫరెంట్ ఇమేజ్‌ను తీసుకొచ్చింది. ఇప్పుడు ఆ మూవీ కొనసాగింపుగా 'డబుల్ ఇస్మార్ట్' వస్తోంది. మే 15వ తేదీన ఈ మూవీకి సంబంధించి 85 సెకన్ల వీడియోను విడుదల చేయనున్నారు.

ఈ క్రమంలో 'డబుల్ ఇస్మార్ట్ రీక్యాప్' అంటూ స్పెషల్ వీడియో పూరి జగన్నాథ్ విడుదల చేశారు. 'ఇస్మార్ట్ శంకర్' మూవీలోని సన్నివేశాలతో పాటు అప్పుడు థియేటర్స్‌లో అభిమానులు చేసిన

# వేట్టాయన్ పూర్తి చేసిన రజనీకాంత్



వయసుతో సంబంధంతో లేకుండా యువ హీరోలతో పోటీ పడుతూ వరుస చిత్రాల్లో నటిస్తున్నారు తలైవా రజినీకాంత్. సెట్స్ మీదున్న సినిమాల్ని త్వరగా పూర్తి చేస్తూ, కొత్త కథల్ని ఆహ్వానిస్తూ మెరుపు వేగం ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కథానాయకుడిగా టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'వేట్టయాన్' ఇప్పటికే ఆయన పార్ట్ చిత్రీకరణ పూర్తి చేశారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. దర్శకుడు, చిత్రబృందం రజనీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఫొటోని అందులో పంచుకుంది. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఏడాది అక్టోబరులోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ చిత్రానికి ఇంకా తెలుగు టైటిల్ ఖరారు కాలేదు.